జన్మదిన వేడుకలు జరుపుకోను : డీసీఎం

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకోసం సైనికులు ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సమయంలో ఈ ఏడాది జన్మదిన వేడుకలు జరుపుకోనని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. శనివారం ఈమేరకు బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ఈనెల 15న తన జన్మదినం పేరిట ఎవరూ సంబరాలు చేసుకోరాదన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండడం లేదన్నారు. జన్మదిన వేడుకల ఫ్లెక్సీలు, బ్యానర్‌లు, ప్రకటనలు వేయరాదని విన్నవించారు. దేశ ఐక్యత, సార్వభౌమత్వ రక్షణకోసం సైనికులకు మద్దతుగా నిలుద్దామని పిలుపునిచ్చారు.


కళసా బండూరి వద్ద ఆగిపోయిన కాలువల నిర్మాణం (ఫైల్)

కళసా బండూరికి
మోక్షమెన్నడో..!

- కేంద్ర జలశాఖ నుంచి లభించని అనుమతి
- రెండేళ్ల నుంచి సభలు, ప్రత్యుత్తరాలకే పరిమితం
- ప్రాజెక్టు కోసం రూ.1760 కోట్లు కేటాయించిన రాష్ట్రం
- గోవా అభ్యంతరాలతో ఆగిన పనులు

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): బెళగావి, గదగ్, ధారవాడ జిల్లాలకు తాగునీటిని సమకూర్చేందుకు రాష్ట్రప్రభుత్వం ఉద్దేశించిన కళసా బండూరి కాలువలను మలప్రభ నదికి అనుసంధాన ప్రాజెక్టుకు ఒక అడుగు ముందుకు మూడు అడుగులు వెనక్కి అనేలా సాగుతోంది. కాలువల అనుసంధానం చేసే ప్రదేశంలో మహారాష్ట్ర సహ్యాద్రి పులుల అభయారణ్యం, కాళి పులుల అభయారణ్య ప్రదేశంలో చేపట్టదలిచిన పనులకు కేంద్రప్రభుత్వ వివిధశాఖల నుంచి అనుమతులకోసం పడిగాపులు పడే పరిస్థితి కొనసాగుతోంది. ధారవాడ ప్రాంతానికి ప్రధానంగా పశ్చిమకనుమల్లో పుట్టే మలప్రభ నది గోవా రాష్ట్రానికి ప్రధానమైన తాగునీటి వనరుగా ఉంది. దీంతో కళసాబండూరి కాలువల అనుసంధానానికి గోవా ప్రభుత్వం ప్రారంభంనుంచి వ్యతిరేకిస్తూనే ఉంది. పైగా కేంద్రప్రభుత్వంపై మహారాష్ట్ర, గోవాలు ఒత్తిడి తెస్తున్నాయి. ఈ పరిణామం మూడు జిల్లాల ప్రజల తాగునీటికి దశాబ్దాకాలంగా హాహాకారాలు కొనసాగుగుతన్నాయి.

గడిచిన రెండేళ్లుగా కేంద్రప్రభుత్వ అనుబంధమైన వివిధశాఖల అనుమతులకోసం సభలు, సమావేశాలు ఉత్తరప్రత్యుత్తరాలకే సరిపోయింది. రాష్ట్రానికి అనుకూలమైన ఏ విధమైన ప్రగతి సాధ్యం కాలేదు. కళసా బండూరి ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులిస్తే నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం రూ.1,760 కోట్లు సిద్ధం చేసింది.

కళసా మళ్లింపు ప్రాజెక్టు, కళసా కాలువ, హళతార కాలువ, సుర్లా కాలువలనుంచి తక్కువ ఎత్తునుంచి మలుపులు ఉండే చోట ఆనకట్ట నిర్మించి ఎత్తిపోతల రూపంలో నీటిని మళ్లించదలిచారు. ఇందుకోసం పంప్‌హౌస్, జాక్‌వెల్, రైజింగ్ మెన్, నీటిని మళ్లించే ప్రాజెక్టు ఇది. ఇందుకోసం రూ.995.30 కోట్ల మొత్తంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు 2023 ఫిబ్రవరి 27న పాలనా పరమైన అనుమతులు ఇచ్చారు. 2023 డిసెంబరులో జరిగిన కర్ణాటక నీరావరి బోర్డు సభలో కళసా ప్రాజెక్టుకు సంబంధించి నిర్మాణాలకు రూ.463.19 కోట్లతో కాంట్రాక్టు ఇచ్చారు. ఈ కాంట్రాక్టు ఇచ్చే సమయంలో అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖల అనుమతులు జాప్యమైతే ఏ విధమైన అదనపు క్లెయిమ్‌లను చేయమని సీల్డ్ కవర్‌లో 2024 మార్చి 15న ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు హామీ ఇచ్చింది. బండూరి కాలువ మలుపు ఆనకట్ట నిర్మించి నీటిని మళ్లించే ప్రాజెక్టుకు రూ.764 కోట్లు ఖర్చు కానుందని అందుకు 2023 ఫిబ్రవరి 27న ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. బండూరి కాలువ పనులను రూ.666.80 కోట్ల కాంట్రాక్టును కేటాయించారు.

పర్యావరణ అనుమతులే కీలకం

పర్యావరణ, అటవీ, వన్యప్రాణులశాఖ అనుమతులు కీలకం. కళసా కాలువ మళ్లింపునకు సంబంధించి కేంద్రప్రభుత్వ అధీనంలోని పర్యావరణ, అటవీ, వన్యజీవి మండలి అనుమతులు పొందడం అవసరం. అయితే తాగునీటి ప్రాజెక్టు కావడంతో అనుమతులు అవసరం లేదని కేంద్రపర్యావరణశాఖ 2019లోనే స్పష్టతతో అనుమతులు ఇచ్చింది. కాలువల మళ్లింపునకు 26,825 హెక్టార్ల అటవీభూమి అవసరమని 2022లో బెంగళూరులోని ప్రాంతీయ ఉన్నతాధికారి సమితి (ఆర్‌ఈసీ) కేంద్రం, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ పరిశోధనా మంత్రిత్వ శాఖలకు విన్నవించారు. ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన సభలో కాలువల మళ్లింపుకోసం ప్రస్తావించిన భూమిలో 10,685 హెక్టార్ల భూమి టైగర్ కారిడార్ ప్రదేశంలో ఉన్నందున కేంద్ర వన్యజీవి మండలికి అనుమతులు కోసం వినతులు ఇవ్వాలని ఆర్‌ఈసీ మార్గదర్శకాలు చేసింది. అందుకు అనుగుణంగా రాష్ట్ర వన్యజీవిమండలి కేంద్రమండలికి ప్రస్తావనలను పులి సంరక్షణా ప్రాధికారకు బదిలీ చేశారు. పులుల సంరక్షణ ప్రాధికార బృందం ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించి ప్రాధికారకు నివేదిక సమర్పించింది. ప్రస్తుతం ఈ విషయం సుప్రీంకోర్టులో ఉన్నందున పులుల సంరక్షణ ప్రాధికార ఎటువంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. బండూరి కాలువ మళ్లింపు ప్రాజెక్టుకు పర్యావరణ వన్యజీవిశాఖ అనుమతులు అవసరం లేదు. అయితే 28,442 హెక్టార్ల అటవీ ప్రాంతం స్వాధీనం చేసుకునేందుకు బెంగళూరు ఆర్‌ఈసీ, కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ, వాతావరణ పరిశోధనశాఖకు 2024 నవంబరు 26న మార్పు చేస్తూ నివేదిక సమర్పించారు. మరింత సమాచారం అవసరమని ఆర్‌ఈసీ ప్రస్తావనను వాయిదా వేసింది.

ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్

మహదాయి ట్రిబ్యునల్ 2018 ఆగస్టు 14న ఇచ్చిన అంతిమ తీర్పుకు అనుగుణంగా కళసా-బండూరి కాలువలకు నీటి కేటాయింపులు చేశారు. కళసా కాలువకు 1.72 టీఎంసీలు, బండూరి కాలువకు 2.18 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. 2020 ఫిబ్రవరి 27న కేంద్రప్రభుత్వం ప్రత్యేకమైన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

కర్ణాటక వాదనలు ఇలా...

బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా కనకుంది, పరిసర గ్రామాల్లో కాలువకు అనుబంధంగా ప్రాజెక్టు, జాక్‌వెల్, పంప్‌హౌస్, విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్‌లను ఏర్పాటు చేసేందుకు కాళి, సహ్యాద్రి పులుల అభయారణ్య ప్రదేశంలో కారిడార్‌లో 10,685 హెక్టార్ల అటవీభూమిని వినియోగించుకునేందుకు కళసా ప్రాజెక్టుకు వన్యజీవి ప్రస్తావనలను కోరారు. సుప్రీంకోర్టు నుంచి కర్ణాటకలో ప్రాజెక్టు అమలుకు సంబంధించి శాసనబద్ధమైన నిబంధనలను కేంద్రప్రభుత్వం నుంచి పొందేందుకు ఎటువంటి ఆంక్షలు విధించేది లేదంటూ కర్ణాటక అటవీశాఖ ముఖ్యకార్యదర్శి స్పష్టం చేశారు. ఇటీవలే ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం, డీసీఎంలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌లను కలసి కళసా-బండూరి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.




సెప్టెంబరులో జాతీయస్థాయి సదస్సు

- హాజరు కానున్న అన్ని రాష్ట్రాల స్పీకర్లు


మాట్లాడుతున్న స్పీకర్ యూటీ ఖాదర్

బెంగళూరు, మే 10(ఆంధ్రజ్యోతి): కామన్వెల్త్ పార్లమెంట్ సంఘం అఖిలభారత స్పీకర్ల సమావేశం సెప్టెంబరు 8నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ తెలిపారు. రాష్ట్ర చరిత్రలో జాతీయస్థాయి స్పీకర్ల సదస్సు జరగడం ఇదే తొలిసారి అన్నారు. మంగళూరులో శనివారం స్పీకర్ యూటీ ఖాదర్ మాట్లాడుతూ సదస్సు ఎక్కడ జరపాలనేది రెండు ప్రదేశాలను ఎంపిక చేశామన్నారు. మూడు రోజుల సదస్సు ముగిశాక 11న స్పీకర్లకు రాష్ట్ర పర్యాటక ప్రాంతాలను సందర్శించే కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. అందులో మైసూరు, మంగళూరు, బేలూరులో ఒక ప్రదేశాన్ని సందర్శిస్తారన్నారు. సమ్మేళనానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందన్నారు. స్పీకర్, సభాపతిలతోపాటు డిప్యూటీ స్పీకర్, ఉప సభాపతులు, శాసనసభ కార్యదర్శులు, సీనియర్ అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజాప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చలు జరుగుతాయన్నారు. సెప్టెంబరు 8న విధానసౌధలో లోక్‌సభ స్పీకర్ సదస్సును ప్రారంభిస్తారన్నారు. సీఎం సిద్దరామయ్య ముఖ్యులుగా పాల్గొంటారన్నారు. ప్రారంభ, ముగింపు సభలకు ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తామన్నారు.

కేపీసీఎల్‌లో భారీ బందోబస్తు


కేపీసీఎల్‌లో కవాతు చేస్తున్న పోలీసు బలగాలు

కంప్లి, మే 10(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కుడితిని పట్టణం వద్ద ఉన్న కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో శనివారం పోలీసు శాఖ భారీ బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముఖ్యమైన ప్రదేశాల వద్ద భద్రత కట్టుదిట్టం చేశామన్నారు. ప్రధాన ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కేంద్రం నుంచి అదనపు బలగాలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. కార్యాలయంలోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసే లోపలికి అనుమతిస్తున్నట్లు తెలిపారు.


కేపీసీఎల్ కేంద్రంలో ప్రధాన ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తుంగభద్ర జలాశయం వద్ద మాక్ డ్రిల్..

బళ్లారి గాంధీనగర్ : సరిహద్దులో ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో జలాశయాల వద్ద భద్రత పెంచాలని కేంద్రం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తుంగభద్ర జలాశయం వద్ద భద్రత పెంచారు. శనివారం మాక్ డ్రిల్ నిర్వహించి ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాదసమయంలో ఎలాంటి రక్షణలు తీసుకోవాలి, ఎలా కాపాడుకోవాలి తదితర వాటిపై భద్రతా సిబ్బంది డ్రిల్ ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించారు.


తుంగభద్ర జలాశయం వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది

15 నుంచి గ్రేటర్ బెంగళూరు

- కేబినెట్ తీర్మానం మేరకు పాలికెల విభజన



బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) ఈనెల 15నుంచి గ్రేటర్ బెంగళూరు ప్రాధికారగా మంత్రివర్గం తీర్మానించింది. దీంతో దశాబ్దాలుగా బీబీఎంపీగా కొనసాగిన నగరం ఇకపై గ్రేటర్ బెంగళూరు ప్రాధికారగా మారనుంది. గ్రేటర్ బెంగళూరు ప్రాధికారగా నిర్ణయించే ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రస్తుత బీబీఎంపీ 708 చదరపు కిలోమీటర్ల పరిధి కాగా భవిష్యత్తులో విస్తరించే ప్రదేశం కూడా ఇదే ప్రాధికార కిందే రానుంది. పాలన సరళీకృతం కోసం 7 పాలికెలు చేయాలని కేబినెట్‌లో చర్చించారు. అయితే ఇందుకు సంబంధించి నిబంధనలు రూపొందించాల్సి ఉంది. బెళ్ళందూరు చెరువు అభివృద్ధి చేస్తున్న బీడీఏకు అదనంగా అవసరమైన 79.67 కోట్ల రూపాయలలో 75శాతం ప్రభుత్వం భరించేందుకు అంగీకరించారు. బెంగళూరు నగర పరిధిలోని వృషభావతి వ్యాలీలో సెకండ్‌స్టేజ్‌లో సంస్కరించి 308 ఎంఎల్‌డీ నీటిని 259 చెరువులకు మళ్లించే పనులకు అంగీకరించారు.

ఘనంగా ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముళబాగిలు, మే 10(ఆంధ్రజ్యోతి): హనుమాన్ నామస్మరణ మార్మోగింది. ముళబాగిలు పట్టణంలోని పురాణ ప్రసిద్ధ ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి, పద్మావతి, గోవిందరాజస్వామి, వరదరాజస్వామి, చన్నకేశస్వామి, వేణుగోపాలస్వామి, శ్రీరాముడు దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, తహసీల్దార్ వీ గీతా మహామంగళారతి నిర్వహించి రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఈఓ కేవీ సుబ్రమణ్యం, తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఎస్ అరవిందగౌడ, ఆర్ఐ సుబ్రమణి, ఆలయ నిర్వహణా సమితి అధ్యక్షుడు ఆర్ఎస్ సుహాస్‌శెట్టి పాల్గొన్నారు.

అమరవీరుడికి ఘన నివాళి

బాగేపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పాక్ దాడుల్లో కన్నుమూసిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం సైనికుడు మురళీనాయక్‌కు స్థానికులు నివాళి అర్పించారు. శనివారం నాయక్ పార్థివదేహం బెంగళూరు నుంచి బాగేపల్లి మీదుగా సరిహద్దులోని స్వగ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా వద్ద స్థానికులు జాతీయపతాకాన్ని చేతబట్టి నాయక్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. శత్రు దేశాన్ని మట్టుబెట్టి ప్రాణాలు అర్పించిన నీ త్యాగాన్ని తెలుగు జాతి నిత్యం గుర్తుంచుకుంటుంది అంటూ నాయక్‌ను తలుచుకుని కన్నీరుమున్నీరయ్యారు. నాయక్ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. యువత నాయక్ త్యాగాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. దేశంకోసం కన్నుమూసిన మురళీ నాయక్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు అభిప్రాయపడ్డారు.


టోల్‌ప్లాజా వద్ద మురళీ నాయక్‌కు నివాళి అర్పిస్తున్న స్థానికులు

రైతుల పరిహారంపై జీఎస్టీ
విధించవద్దు

- వాణిజ్య పన్నుల శాఖకు హైకోర్టు ఆదేశం



బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకోసం భూములు ఇచ్చిన రైతులకిచ్చే పరిహారం సొమ్ముపై జీఎస్టీ విధించరాదని హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. బెంగళూరు మెట్రో రైల్ ప్రాజెక్టు, పరిశ్రమల అభివృద్ధికి తీసుకునే భూములకు జీఎస్టీ చెల్లించాలని వాణిజ్యపన్నులశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై బాధితురాలు ఆశాతోపాటు పలువురు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తి ఎస్ఆర్ కృష్ణకుమార్ ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది. రైతులకు ఆసక్తి లేకున్నా అభివృద్ధికోసం భూములు ఇస్తారన్నారు. భూములు కోల్పోవడం అంటే సులువైన విషయం కాదన్నారు. భూమితో రైతులకు భావనాత్మక సంబంధం ఉంటుందని పరిహారానికి జీఎస్టీ విధిస్తే ఎలాగంటూ అభ్యంతరం తెలిపారు. దీంతో రైతులకు ఉపశమనం లభించినట్లయ్యింది.

ఘనంగా హేమారెడ్డి మల్లమ్మ జయంత్యుత్సవం 8
అఖిల భారత సమ్మేను విజయవంతం చేయండి



సైనిక వాహనంలో సగర్వంగా.. సొంతూరుకు అమర వీరుడు..



బరువెక్కిన హృదయాలు..



బెంగళూరు విమానాశ్రయంలో మురళీనాయక్ పార్థివ దేహం వద్ద సెల్యూట్ చేస్తున్న ఏపీ మంత్రి సవిత, మహారాష్ట్ర మంత్రి ఉదయ్

వీరుడా.. జోహార్..!



కళ్లితండాకు చేరిన మురళీ నాయక్ పార్థివ దేహం

- వీర జవానుకు అడుగడుగునా కన్నీటి నీరాజనం
- బెంగళూరు ఎయిర్ పోర్టు నుంచి స్వగ్రామం వరకూ...
- అగ్నివీర్ మురళీనాయక్ కుటుంబానికి పరామర్శల వెల్లువ
- ఆర్థిక సాయం అందజేసిన పలువురు
- నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం, మంత్రులు లోకేశ్, అనిత

పుట్టపర్తి/అనంతపురం నెట్‌వర్క్, మే 10(ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లో పాకిస్థాన్ సైనికులతో పోరాడుతూ అమరుడైన అగ్నివీర్ జవాన్ మురళీనాయక్ పార్థివ దేహం అశేష జనవాహిని మధ్య బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని తన స్వగ్రామం కళ్లి తండాకు శనివారం రాత్రికి చేరుకుంది. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న మురళీ నాయక్, రాజౌరి సెక్టార్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో గురువారం అర్ధరాత్రి అసువులు బాసిన విషయం తెలిసిందే. కళ్లి తండాకి చెందిన శ్రీరామనాయక్, జ్యోతిబాయి దంపతుల ఏకైక కుమారుడు మురళీనాయక్. ఆయన పార్థివ దేహాన్ని శనివారం రాత్రి సైనికాధికారులు కళ్లి తండాకి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఢిల్లీ నుంచి మురళీనాయక్ పార్థివ దేహాన్ని బెంగళూరులోని దేవనహళ్లి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు తీసుకువచ్చారు. ఎయిర్ పోర్టు వద్ద సైనిక అధికారులు సైనిక వందనం సమర్పించారు. అనంతరం పార్థివ దేహాన్ని ఆర్మీ వాహన కాన్వాయ్‌లో తీసుకుని కళ్లి తండాకు బయలుదేరారు.

మిన్నంటిన నినాదాలు

యుద్ధ భూమిలో వీరమరణం పొందిన వీర జవాన్ మురళీనాయక్ పార్థివ దేహాన్ని బెంగళూరు విమానాశ్రయం నుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్న వేళ అన్ని ప్రాంతాల్లో అమర్ రహే నినాదాలు మిన్నంటాయి. జాతీయ రహదారి పొడవునా జనం పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. జాతీయ జెండాలు చేతబూని, వాహనాలపై పూల వర్షం కురిపించారు.

అన్ని గ్రామాల కూడళ్లలో వాహనాలను ఆపి, మురళీ నాయక్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర తదితరులు వీరజవాన్ పార్థివ దేహం కోసం బాగేపల్లి టోల్ గేట్ వద్ద ఎదురుచూశారు. వారు శనివారం మధ్యాహ్నమే అక్కడకు చేరుకొని వేచి ఉన్నారు. వారు మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిదన్నారు. ఆయన చూపిన ధైర్య సాహసాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. మురళీనాయక్ పార్థివ దేహాన్ని చూసేందుకు ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఆ ప్రాంగణమంతా జైజవాన్, మురళీనాయక్ అమర రహే నినాదాలతో మార్మోగింది.

మహారాష్ట్రలో విగ్రహం ఏర్పాటు చేస్తాం



ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్ విగ్రహాన్ని మహారాష్ట్రలో ఏర్పాటు చేస్తామని ఆరాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్‌సంపత్ అన్నారు. ఆయన శనివారం ముంబాయి నుంచి బెంగళూరుకి చేరుకొని అక్కడ నుంచి రోడ్డు మార్గాన వీరజవాన్ మురళీనాయక్ స్వగ్రామమైన కళ్లితండాకి వచ్చారు. ఈ సందర్భంగా మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేతో వీడియోకాల్‌లో మాట్లాడించారు. జవాన్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ఉదయ్ సంపత్ విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి చిన్న తండాలో పుట్టిపెరిగిన వీరజవాన్ దేశం కోసం వీరమరణం పొందడం గర్వకారణమన్నారు. మురళీనాయక్ జన్మించింది మహారాష్ట్రలో కాబట్టి మా రాష్ట్రంలో విగ్రహం పెట్టడానికి ప్రయత్నిస్తామన్నారు.

ప్రతి మహిళ బొట్టులో సిందూరమై నిలిచారు: సింగర్ మంగ్లీబాయి



చిన్న వయసులోనే వీరమరణం పొందిన మురళీ నాయక్ దేశంలోని ప్రతి మహిళ బొట్టులోనే సిందూరమై నిలిచారని కొనియాడారు. కళ్లితండాకు శనివారం చేరుకున్న ఆమె జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు.

పలువురి పరామర్శ.. ఆర్థిక సాయం



కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అలిమినేని సురేంద్రబాబు తరపున చెక్కును మురళీనాయక్ కుటుంబ సభ్యులకు అందజేస్తున్న దృశ్యం

వీరజవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని శనివారం పలువురు పరామర్శించారు. కళ్లితండాలో వీరజవాన్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఒక నెల వేతనం రూ.1.75లక్షలు సాయంగా ప్రకటించడంతో ఆ మొత్తాన్ని ఆయన అనుచరులు ఆ కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో అందజేశారు. గోరంట్ల మండలానికి చెందిన టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, నానేనాయక్‌లు రూ. 30వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మురళీనాయక్ డిగ్రీ క్లాస్‌మేట్స్ కళ్లితండాకి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- మురళీనాయక్ తల్లిదండ్రులను శనివారం నల్లచెరువు మండలానికి చెందిన పారిశ్రామిక వేత్త పాల్యం సుధాకర్ పరామర్శించారు. రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

అందరినోట కళ్లితండా మాట



నిన్నటి వరకు ఆ తండా పేరు గోరంట్ల మండలానికి మాత్రమే పరిచయం. కానీ వీరజవాన్ మురళీనాయక్ వల్ల ఆ తండా పేరు ప్రస్తుతం దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. కళ్లితండాలో 70 నివాసాలు, 250 జనాభా ఉన్నారు. ఈ తండా నుంచి మురళీ నాయక్ అగ్నివీర్‌కి ఎంపికై దేశసరిహద్దులో గురువారం రాత్రి జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందారు. దీంతో ఆయన స్వగ్రామం కళ్లితండా గురించి వివిధ రాష్ట్రాల ప్రజలు గూగుల్ లో వెదుకుతూ తండాకి క్యూకట్టారు. రెండురోజులుగా ఆ తండాలో పోలీసులు బూటుచప్పుళ్లు, పోలీసు వాహనాల సైరన్‌లు మోగుతు న్నాయి. మురళీనాయక్ వలన తమ గ్రామానికి ఘనత వచ్చిందని తండా వాసులు గర్వపడుతున్నారు.



గుండె పగిలిన తండా జనం..



జోహారులు..



అంత్యక్రియలకు భారీ ఏర్పాట్లు

వీరజవాన్ మురళీనాయక్ పార్థివ దేహం శనివారం రాత్రికి కళ్లితండాకి చేరుకుంది. ఆయన అంత్యక్రియలు ఆదివారం తండా సమీపంలో జరగనున్నాయి. ఆయన పార్థివ దేహాన్ని ప్రజలు చూడటానికి ఇంటి వద్ద ఏర్పాట్లు చేశారు. అంత్యక్రియలకు హాజరయ్యే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖుల కోసం ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం కళ్లితండా వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు సుమారు 500 మందికి పైగా బందోబస్తులో ఉన్నట్లు పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. విద్యుత్ సౌకర్యంలో అంతరాయం కలగకుండ ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటుచేశారు. గోరంట్ల పుట్టపర్తి రహదారి నుంచి కళ్లితండాలోకి వచ్చేవరకు రోడ్డుకి ఇరువైపులా ముళ్లపొదలు తొలగించారు. పారిశుధ్య పనులు చేశారు. శ్మశాన వాటికకు వెళ్లే రహదారిని పూర్తి చేశారు.

నేడు ప్రముఖుల రాక

పాక్‌కాల్పుల్లో వీర మరణం పొందిన వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు నారాలోకేశ్, వంగలపూడి అనిత హాజరుకానున్నట్లు జిల్లా ఎస్పీ శనివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. వీర జవాన్ మురళీనాయక్ భౌతికకాయం కళ్లితండాకు శనివారం రాత్రికి చేరుకుంది. గుమ్మయ్యగారిపల్లి కూడలి నుంచి భారీర్యాలీగా గ్రామానికి చేరుకున్న అనంతరం అదివారం ఆయన అంత్యక్రియలు అధికారిక, సైనిక లాంఛనాలతో జరగనున్నట్లు తెలిపారు. దీంతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.



వృథాకాదు నీ మరణం: ఎంఎస్ రాజు

దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళీనాయక్ మరణం వృథాకాదు అని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పేర్కొన్నారు. మడకశిరలోని విశ్రాంత భవనం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు శనివారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. భారీగా జనం హాజరవడంతో ఆ ప్రాంతమంతా జై జవాన్ నినాదాలతో మారుమోగింది. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండియన్ ఆర్మీకి తన నెల జీతాన్ని విరాళంగా ప్రకటిస్తున్నానని తెలిపారు.



మురళీనాయక్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల

నేటి యువతకు ఆదర్శం: పరిటాల సునీత

నేటి తరం యువతకు వీరజవాన్ మురళీనాయక్ ఆదర్శంగా నిలిచారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గోరంట్ల మండలం కళ్లితండాకు శనివారం ఆమె ధర్మవరం టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో కలిసి వెళ్లారు. వీరజవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. వీరజవాన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 25ఏళ్లకే తన ప్రాణాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వీరుడు మురళీనాయక్ అని కొనియాడారు. ఆ కుటుంబానికి రూ.2లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే కందికుంట

దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన వీర జవాన్ మురళీ నాయక్ త్యాగం మనందరికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరిలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సరిహద్దు కాల్పుల్లో అసువులు బాసిన వీర జవాన్‌కు అందరూ ఘనంగా నివాళులర్పించాలన్నారు. ఆకుటుంబానికి అండగా నిలవాలన్నారు. మురళీనాయక్ పార్థివదేహం స్వగ్రామానికి వస్తున్న నేపథ్యంలో కొడికొండ చెక్ పోస్టు వద్దకు వంద వాహనాలతో వెళ్లి సైనిక ర్యాలీకి సంఘీభావం ప్రకటించనున్నట్లు చెప్పారు.



జవాను పార్థివదేహం కోసం ఎదురు వెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు

చరిత్రలో నిలిచిపోతుంది: అమిలినేని

కళ్యాణదుర్గం, మే 10 (ఆంధ్రజ్యోతి): వీరజవాన్ మురళీనాయక్ మరణం చరిత్రపుటల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మండల ంలోని తిమ్మసముద్రం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరజవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వీర జవాన్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తన నెల జీతం రూ.1.75 లక్షలు వీరజవాన్ కుటుంబానికి అందజేస్తున్నట్లు ప్రకటించారు.



మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొలమ్...

జిడ్డు కృష్ణమూర్తి (జయంతి)




ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి 1895 మే 11న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. 1929 నుంచి మరణించేంతవరకు ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ తాత్విక, ఆధ్యాత్మిక అంశాలపై అనేక ప్రసంగాలు చేశారు. ఆయన బోధించిన తత్వం ఏ నిర్ణీత తాత్వికచట్రంలో ఇమడదు. దాని ప్రత్యేకత దానిదే. మానసిక విప్లవం, మనోభావ విచారణ, ధ్యానం, మానవ సంబంధాలు, సమాజంలో మౌలిక మార్పు, మనిషి తనంతట తానుగా భయం, కట్టుబాట్లు, అధికారం, మూఢవిశ్వాసాలనుంచి విముక్తి చెందాలని బోధించారు. తాను గురువును, ప్రవక్తను కాదని ప్రకటించుకున్నారు. 1986 ఫిబ్రవరి 17న కన్నుమూశారు.

మాధవపెద్ది సత్యం (జయంతి)



తెలుగు సినిమా నేపథ్య గాయకుడు మాధవపెద్ది సత్యం 1922 మే 11న బాపట్లలో జన్మించారు. 8ఏళ్లకే నాటకాలలో నటించారు. తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హిందీ, సింహళభాషలు సహా దాదాపు అన్ని భారతీయ భాషలలో 7వేలకు పైగా పాటలు పాడి పేరొందారు. తొలిసారిగా వెండి తెరపై హిందీ, తమిళ ద్విభాషా చిత్రం 'రామదాసు'లో కనిపించారు. 'షావుకారు' తో తెలుగు సినీరంగంలోకి ప్రవేశించారు. ప్రత్యేకించి పౌరాణిక సినిమాలలో పద్యాలు పాడడంలో పేరొందారు. 'అయ్యయో జేబులో డబ్బులు పోయెనే, 'వివాహ భోజనంబు వింతైన వంటకంబు' వంటి పాటలు ఎంతో పేరొందాయి. 75వ యేట 1997లో 'సింధూరం' సినిమాలో 'సంకురాతిరి పండుగ వచ్చెరో పాటపాడి ప్రశంసలు అందుకున్నారు. 2000 డిసెంబరు 18న కన్నుమూశారు.

డాక్టర్ సామల సదాశివ (జయంతి)



తెలుగు, ఉర్దూ రచయిత డాక్టర్ సామల సదాశివ 1928 మే 11న (అప్పటి ఆదిలాబాద్) ప్రస్తుత కొమరం భీం జిల్లా దహెగావ్ మండలం తెనుగుపల్లెలో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. హిందూస్తానీ సంగీత పండితుడు. ఉపాధ్యాయుడు. హిందూస్తానీ సంగీతాన్ని తొలిసారిగా తెలుగు పాఠక లోకానికి పరిచయం చేసిన తొలి తెలుగు రచయిత. సంస్కృత, ఉర్దూ, పర్షియన్, మరాఠీ, హిందీ, ఆంగ్ల, తెలుగు భాషలలో రాణించారు. 425కుపైగా రచనలు చేశారు. ఉర్దూ పత్రిక సియాసత్‌లో అనేక ఏళ్లపాటు ఆయన వ్యాసాలు ప్రచురించబడ్డాయి. మలయ మారుతాలు, సంగీత శిఖరాలు వంటి రచనలు పేరొందాయి. 2012 ఆగస్టు 7న కన్నుమూశారు.

25న శ్రీరాముడి శోభాయాత్ర

శిడ్లఘట్ట, మే 10(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 25న శ్రీరాముడి శోభాయాత్ర ఉంటుందని రూరల్ హోబళి బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 25న ఆదివారం ఉదయం 11 గంటలకు హనుమంతపురగేట్ సమీపానగల ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన అనంతరం శ్రీరామోత్సవ సమితి సహకారంతో శోభాయాత్రకు శ్రీకారం చుడతారన్నారు. శిడ్లఘట్ట పట్టణంలోని ప్రధాన రహదారులమీదుగా ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి సొల్లాపురమ్మ ఆలయం రోడ్డు వేదికకు చేరుకుంటుందన్నారు. కాగా హిందూ సంప్రదాయాన్ని కాపాడేందుకు అన్ని సంఘాలు సహకారం అందించాలన్నారు. కాగా హిందూ సంప్రదాయాన్ని దెబ్బతీసేలా కొంతమంది లవ్ జిహాద్‌తో ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. ప్రభుత్వ భూములను, హిందూ సంఘాల భూమిని ఇతర మతాల వారు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఈనేపథ్యంలో హిందువులలో ఐకమత్యం పెరగాలన్నారు. తద్వారా హిందూ సంప్రదాయ మనుగడ సాధ్యమన్నారు. కాగా కోలారు నుంచి వచ్చే వేళ పెద్దసంఖ్యలో మసీదులో కనిపిస్తాయని వీటి మనుగడకు నిధులు ఎవరిస్తున్నారంటూ ప్రశ్నించారు. కొంతమంది ఉగ్రవాదులు మసీదుల అభివృద్ధికి శ్రమిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఉగ్రవాద చర్యలకు అడ్డుకట్ట వేయాలన్నారు. శోభాయాత్రకు నిర్మలానందనాథ స్వామిజీ లేదా మంగళానంద నాథస్వామిజీ, చక్రవర్తి సూలిబెలె, ఇంకా స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు భాగస్వామ్యులు అవుతారన్నారు. మీడియా సమావేశంలో నరేశ్, కంబదహళ్ళి సురేంద్రగౌడ, అంబరీశ్, పలిచేర్లు సోమశేఖర్, పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో సీకల్ రామచంద్రగౌడ తదితరులు

తాలూకా కార్యాలయంలో వేమన జయంతి

బంగారపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): మహాకవి వేమన జయంతిని తాలూకా కార్యాలయంలో శనివారం సరళంగా ఆచరించారు. తాలూకా రెడ్డిజనసంఘం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 16వ శతాబ్దంలో తెలుగు కవులలో వేమన ప్రముఖులన్నారు. కన్నడలో సర్వజ్ఞ, తమిళంలో తిరువళ్ళువర్ లాగే తెలుగులో వేమన మహాకవి, మహాయోగి అయ్యారన్నారు. పద్యాల ద్వారా సామాన్య ప్రజలను సైతం చైతన్యం చేసిన ఘనత వేమనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్డిజన సంఘం అధ్యక్షుడు తిప్పారెడ్డి, శివారెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్డిజన సంఘం ముఖ్యులు

60 మందికి సామూహిక సీమంతం



సీమంతం నిర్వహణలో ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ కాలనీలోని బీబీఎంపీ కాన్పుల ఆసుపత్రిలో 60మందికి సామూహిక సీమంతం నిర్వహించారు. కట్టె సత్యఫౌండేషన్, రాధాకృష్ణ ఫౌండేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో బసవనగుడి ఎమ్మెల్యే రవి సుబ్రమణ్య, మాజీ మేయర్ సత్యనారాయణ, రాధాకృష్ణ ఫౌండేషన్ గైనకాలజిస్ట్ విద్య వి భట్, పర్యావరణ నిపుణురాలు రేవతి కామత్‌లు పాల్గొన్నారు. బీపీఎల్ కార్డు కల్గిన గర్భిణీలకు సీమంతం చేశారు. చీర, గాజులతోపాటు పండ్లు, ప్రొటీన్‌పౌడర్ తదితర వస్తువులను పంపిణీ చేశారు.

చదువుతోపాటు కళల్లోనూ రాణించండి

బెంగళూరు, మే 10(ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడలు, కళల్లోనూ రాణించాలని ప్రముఖ నటుడు డాలి ధనంజయ్ పిలుపునిచ్చారు. బీఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో యాన్యువల్ కల్చరల్ టెక్నికల్ ఫెస్ట్ ఉత్సాహంగా సాగింది. నటి సంజనా ఆనంద్, గాయని అనన్యభట్ ముఖ్యులుగా పాల్గొన్నారు. డాలి ధనంజయ్ మాట్లాడుతూ సంస్కృతం అనే పదం అనంత నుంచి ప్రేరేపితమైందన్నారు. అనంత అంటే అపరిమితమన్నారు. విద్యార్థులు చదువులో రాణించాలని, పట్టుదలతో చదవాలని సూచించారు. మూడు రోజులపాటు జరిగే సంబరాలలో యువ విద్యార్థులు తమ కళలను ప్రదర్శింపచేయాలన్నారు. 200 కళాశాలలు ప్రాతినిధ్యం వహించడం సంతోషకరమన్నారు. ఉత్సవంలో డాక్టర్ బీఎస్ రాగిణి నారాయణ్, అభిరాం శర్మలు పాల్గొన్నారు. మిస్టర్ ఉత్సవ్, డీజే నైట్‌తోపాటు పలు కార్యక్రమాలు జరిపారు. ఆదివారం వరకు ఉత్సవ్ సాగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



కల్చరల్ ఫెస్ట్‌లో నటుడు డాలి ధనంజయ్ తదితరులు

చీనీ టన్ను రూ. 22వేలు

అనంతపురం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22,800 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణీ కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3,900, సరాసరి రూ. 13,500తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 227 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం క్లాక్‌టవర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉపకారవేతనాల కోసం పేద బ్రాహ్మణ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ విద్యార్థినీ మహిళా సంక్షేమసంఘం కార్యదర్శి రమాదేవి తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరం ఆరోతరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న ప్రతిభగల పేద బ్రాహ్మణ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9703789201, 9490130999లను సంప్రదించాలని కోరారు.

అదుపుతప్పిన బస్సు - ప్రయాణికులకు గాయాలు

దొడ్డబళ్ళాపుర, మే 10 (ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళా పుర - హొస్కోటెల మధ్య వెళ్లే జాతీయ రహదారి 648పై కేఎస్ఆర్టీసీ బస్సు టైర్ పేలి అదుపు తప్పి అడ్డుగోడను ఢీ కొని ఆగింది. డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో సుమారు 30కుపైగా ప్రయాణీకులు ఉన్నారు. దొడ్డబళ్ళాపుర తాలూకా మెణసినగేట్ సమీపాన సూలికుంటె నుంచి దొడ్డబళ్ళాపురకు బస్సు వస్తుండగా టైర్ పేలి అదుపు తప్పింది. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక కెస్తూరు పంచాయతీ మాజీ అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ ప్రమాదాలకు టోల్ సిబ్బంది, జాతీయ రహదారి ప్రాధి కారయే బాధ్యత వహించాలన్నారు. స్థానికంగా భూమి ఉన్నప్పటికీ సర్వీస్ రోడ్డు నిర్మించలేదని మండిపడ్డారు. దీనిపై పలు మార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిం దన్నారు. పలువురు గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.



మెణసినగేట్ వద్ద పొలాల్లోకి దూసుకుపోయిన బస్సు

కేవీజీ పాలిటెక్నిక్ రామకృష్ణ హత్య కేసులో సుప్రీంకోర్టులో అందరికీ ఊరట

బెంగళూరు, మే 10(ఆంధ్రజ్యోతి): సుళ్యలోని కేవీజీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏఎస్ రామకృష్ణ హత్య కేసులో యావజ్జీవ కారాగారశిక్షకు గురైన నిందితుడికి సుప్రీంకోర్టు ఊరట కలిగించింది. 2011 లో రామకృష్ణ హత్య జరిగింది. దక్షిణకన్నడ జిల్లా సెషన్స్ కోర్టు విచారణ చేపట్టింది. సాక్ష్యాలు లేవని పెండింగ్‌లో ఉండేది. ప్రభుత్వం హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో 2023లో నిందితులకు యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. హైకోర్టు తీర్పుపై నిందితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం నిందితులు డాక్టర్ రేణుకాప్రసాద్, మనోజ్ రై, నాగేశ్ హెచ్ఆర్, వామన పూజారి, శరణ్ మంగళూరు, భవానిశంకర్‌లను శిక్షనుంచి ఉపశమనం కలిగించింది. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, గిరీశ్ అనంత మూర్తి వాదనలు వినిపించారు.

ఎస్ఎస్ఎల్‌సీ టాపర్లకు అభినందన



టాపర్ విద్యార్థులతో నిర్వాహకులు

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఐసీఎస్ఈ విభాగంలో ఉత్తమ మార్కులు సాధించిన చంద్ర లే అవుట్ సెయింట్ ఫ్లవర్ ఇంగ్లిష్ స్కూల్ విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందించారు. శనివారం పాఠశాల చైర్మన్ డాక్టర్ జీఆర్ కృష్ణప్ప ఆధ్వర్యంలో సత్కరించారు. విద్యార్థులు ఎస్వి విదిత్ 94.80శాతం, ఎస్ మోహన్ 93.2శాతం, శశాంక్ కామత్ 92.6శాతం, అనుష్‌కుమార్ 92శాతం మార్కులు సాధించిన విద్యార్థులతోపాటు మరికొంతమందిని సత్కరించారు. 36మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్టు డైరెక్టర్ దర్శన్ కృష్ణ తెలిపారు.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 7.5శాతం ఫీజు పెంపు

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 7.5శాతం ఫీజుల పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఫీజులు పెంచే విషయమై ప్రైవేట్ కళాశాలలు ప్రభుత్వాన్ని విన్నవించాయి. 15శాతానికి ప్రతిపాదన పెట్టగా ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్ తిరస్కరించారు. తాజాగా శుక్రవారం ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధుల బృందం చర్చలు జరిపింది. చివరకు 7.5 శాతం పెంచేందుకు మంత్రి అంగీకరించారు. అసాధారణ పరిస్థితులు ఎదురైతే ఫీజులు రెండు విడతలుగా వసూలు చేసేందుకు వెసలుబాటు కల్పించారు.

వెండి వస్తువులకు పెరుగుతున్న డిమాండ్

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): వెండి వస్తువులకు డిమాండ్ పెరుగుతోందని నటి ఆశికా రంగనాథ్ అభిప్రాయపడ్డారు. ఇటీవలికాలంలో దేవుడి మందిరంతోపాటు పలు వెండి వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఎమ్మాడి సిల్వర్ జ్యువెలర్స్ షాప్ మల్లేశ్వరంలో ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. హైదరాబాద్‌లో నాలుగేళ్లుగా కొనసాగుతున్న శాఖకు అనుబంధంగా మల్లేశ్వరంలో ఏర్పాటుతో నగర ప్రజలకు వెసలుబాటు కల్పించినట్టు అయ్యిందన్నారు. ఆభరణాలు, వస్తువులు మన సంస్కృతి పరంపర అన్నారు.

వందేభారత్ రైలుపై రాళ్ల దాడి

బంగారపేట, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు అనుబంధంగా ఉన్న పవర్‌రూం వద్ద శుక్రవారం సాయంత్రం వందేభారత్ రైలుకు రాళ్లు రువ్విన ఇద్దరు బాలురను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. తాలూకాలోని హుణసనహళ్ళి వద్ద రైల్వే ఫ్లై ఓవర్ వద్ద ముస్లిం వర్గానికి చెందిన 15మంది బాలురు రాళ్లు రువ్వారు. 13మంది పరారయ్యారు. రాళ్లు రువ్వడంతో వందేభారత్ రైలుకు చెందిన రెండు కిటికీల అద్దాలు దెబ్బతిన్నాయి. అంతేకాక రైల్వేశాఖ పవర్‌రూంపై కూడా రాళ్లు వేశారని ఆర్‌పీఎఫ్ అధికారి తెలిపారు. ఘటనపై శనివారం విచారణ చేపట్టామన్నారు. బెంగళూరు దేవనహళ్ళి రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బాలురును తరలించామన్నారు. పిల్లల తల్లిదండ్రులనుంచి లిఖిత పూర్వక హామీ తీసుకున్నాక విడుదల చేశారు.

ఆపరేషన్ సిందూర్‌పై డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారులలో దేశభక్తి పెంపొందించడంతోపాటు సమాజం గురించి అవగాహన పెంచాలని ఆపరేషన్ సిందూర్‌పై డ్రాయింగ్ పోటీలు జరిపారు. విల్సన్‌గార్డెన్ రాణిపార్క్‌లో శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కబ్బన్‌పార్క్ వాకర్స్ అసోసియేషన్, రాణిపార్క్ సంయుక్తంగా పోటీలు నిర్వహించగా పెద్దసంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

ఈ నీరు సురక్షితమేనా..?

- అపరిశుభ్రంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు
- క్లోరినేషన్ ఊసెత్తని అధికారులు
- కలుషిత నీరే గతి ● అటకెక్కిన నీటి పరీక్షలు

కదిరిఅర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): కలుషిత తాగునీటితోనే 80 శాతం రోగాలు ప్రబలుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవిలో దాహార్తిని తీర్చుకోవడానికి దొరికిన నీటిని తాగి అనేకమంది డయేరియా, ఇతర రోగాలబారిన పడుతుంటారు. ప్రజలకు రక్షిత తాగునీటిని అందించే ఉద్దేశంతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయకపోవడం వల్ల పాచిపట్టిన నీటిని తాగాలంటే ప్రజలు భయపడుతున్నారు.

పర్యవేక్షణ ఏదీ?

తాగునీటిని సరఫరా చేసే ట్యాంక్‌లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో రంగుమారిన నీరు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రతి 15రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాల్సి ఉంది. అలాంటిది ఇక్కడ ఏమీ జరగడంలేదు. ఉన్నతాధికారులు వస్తున్నారని సమాచారం వచ్చినప్పుడు మాత్రమే తూతూమంత్రంగా శుభ్రంచేసి చేతులు దులుపుకుంటున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



పట్నం గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న నీటి ట్యాంక్

శుభ్రం చేసే తేదీల ఊసే లేదు

పంచాయతీల పరిధిలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని నింపే ముందు బ్లీచింగ్ పౌడర్‌తో క్లోరినేషన్ చేయాల్సి ఉంది. 15రోజలకు ఒకసారి తప్పకుండా శుభ్రం చేసి, ఆ తేదీని బోర్డులో నమోదు చేయాల్సి ఉంది అనంతరం శుభ్రం చేసే తేదీని కూడా నమోదు చేయాల్సి ఉంది. ట్యాంక్‌ల చుట్టూ అపరిశుభ్రత లేకుండా చర్యలు చేపట్టాలి. కొన్ని పంచాయతీల్లో మినహా నెలలతరబడి శుభ్రం చేయడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పైపులైన్ దెబ్బతిన్నా మరమ్మతులు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. నీటి నాణ్యత పరీక్షించేందుకు ప్రతి సచివాలయానికి జలజీవన్ మిషన్ కింద ఫీల్డు టెస్టింగ్ కిట్లు అందించారు. నీటి నమూనాలను సేకరించి, పరీక్షించేలా ఇంజనీరింగ్ వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరు పరీక్షలు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇది నామమాత్రంగానే జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. నీటి పరీక్షలు సక్రమంగా జరిగితే ఫ్లోరైడ్, క్లోరైడ్, నీటి గాఢత, సాంద్రత, లవణాలు ఏమేరకున్నాయో తెలుస్తుంది. ఫలితాలనుబట్టి నీటి నాణ్యతను పెంచేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పలు సూచనలు చేయవచ్చు.



వరిగిరెడ్డిపల్లి తండాలో కంపచెట్ల మధ్య నీటి ట్యాంక్

మండల పరిస్థితి ఇది

గ్రామాల్లో ట్యాంక్‌ల నిర్వాహణ పంచాయతీల బాధ్యత. నిబంధనల మేరకు ట్యాంక్‌లు శుభ్రం చేసి, శుద్ధనీటిని ప్రజలకు అందించాలి. ట్యాంక్‌లు శుభ్రంచేయడం, కొళాయిల వద్ద బ్లీచింగ్ చల్లడం, నీటిని క్లోరినేషన్ చేయడానికి పంచాయతీ నుంచి నిధులు ఖర్చు పెడతారు. అవి రికార్డుల పరంగా ఉంటున్నాయే తప్ప, క్షేత్రస్థాయిలో పారిశుధ్యం మెరుగుపడడంలేదు. మండల పరిధిలో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు 20, గ్రౌండ్ లెవల్ సర్వీస్ ట్యాంక్‌లు 17 ద్వారా నీటి సరఫరా అవుతోంది. క్లోరినేషన్ నిమిత్తం పంచాయతీకి ఆర్థిక సంఘం నిధులనుంచి ఏటా పదిశాతం నిధులు ప్రభుత్వం కేటాయిస్తుంది. అయితే ఆ నిధులు సక్రమంగా వినియోగించడంలేదు. ఇప్పటికైనా నిబంధనల మేరకు ట్యాంక్‌లను శుభ్రం చేసి, రక్షిత మంచినీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

శుభ్రం చేసి చాలారోజులైంది : నాగేంద్ర, పట్నం

గ్రామంలో రోజూ కలుషిత నీరే వస్తోంది. ట్యాంక్‌లు శుభ్రం చేసి చాలరోజులైంది. ట్యాంక్ చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. పైపులు లీకేజీ అవుతునాయిఇ. అధికారులు ట్యాంక్‌లను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి.

కఠిన చర్యలు తీసుకుంటాం : ఆంజనప్ప, డీఎల్‌పీఓ, కదిరి

పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపడతాం. ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసి తేదీలు నమోదు చేయలని కార్యదర్శులకు సూచిస్తున్నాం. తాగునీటి విషయంలో నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై కఠినచర్యలు తీసుకుంటాం. పారిశుధ్య పనులు ఎప్పటికపుడు యాప్‌ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

పర్యవేక్షణ పెంచుతాం : వెంకటేశ్వర్లు, డీఈఈ



నీటిట్యాంక్‌లను శుభ్రం చేయాల్సిన బాధ్యత పంచాయతీ లేదే. క్రమం తప్పకుండా జరిగేలా పర్యవేక్షణ పెంచుతాం. నీటి ట్యాంక్‌లను శుభ్రం చేసి బోర్డులపై కచ్చితంగా వివరాలు నమోదు చేయిస్తాం.

యువతి ఆత్మహత్య

గార్లదిన్నె, మే 10(ఆంధ్రజ్యోతి): వివాహం వాయిదా పడడంతో మనస్థాపం చెంది ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఇల్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు.. ఇల్లూరుకు చెందిన మస్తానయ్య, సుశీలమ్మ దంపతులు గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె లక్ష్మీనరసమ్మ (23) ఇంటర్ వరకు చదువుకుంది. ఏడేళ్ల క్రితం కుటుంబమంతా బెంగుళూరుకు వలస వెళ్లింది. లక్ష్మీనరసమ్మకు ఇటీవల పెళ్లి కుదిరింది. పది రోజుల క్రితం స్వగ్రామమైన ఇల్లూరుకు వచ్చారు. పెళ్లికి కావాల్సిన ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితం యువతి లక్ష్మీనరసమ్మ అవ్వ మృతి చెందింది. దీంతో పెళ్లి వాయిదా వేశారు. రెండు సంవత్సరాలు క్రితం పెళ్లి నిశ్చయమై రద్దయింది. దీంతో రెండుసార్లు పెళ్లి వాయిదా పడిందని తరచూ బాధపడుతుండేది. తీవ్ర మనస్థాపానికి గురైన లక్ష్మీనరసమ్మ శుక్రవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రపోతున్న సమయంలో ఇంటి గవాక్షం కడ్డీలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

ఆటోలో నుంచి పడి ఒకరి మృతి

బత్తలపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శివాలయం సమీపంలో ఆటోలో నుంచి జారి పడి సూర్యనారాయణ (50) శనివారం మృతి చెందినట్లు ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ముదిగుబ్బ మండలం ఇందుకూరు గ్రామానికి చెందిన సూర్యనారాయణ, తిరుపాల్ కుటుంబ సభ్యులు ఆటోలో ధర్మవరం చెన్నకేశవస్వామి రథోత్సవానికి వెళ్లారు. అనంతరం గిద్దలూరులోని అక్కమ్మ జాతరకు బయల్దేరారు. బత్తలపల్లిలోని శివాలయం సమీపంలోకి రాగానే సూర్యనారాయణ ఆటోలో నుంచి కిందకు జారి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

స్విమ్మింగ్ పూల్‌లో బాలుడి మృతి

ధర్మవరం, మే 10(ఆంధ్రజ్యోతి): స్విమ్మింగ్‌పూల్ మునిగి నందీశ్వరనాయుడు(9) మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో జరిగింది. అనంతపురం జిల్లా పాముదాయి గ్రామానికి చెందిన సంజీవనాయుడు, శారద దంపతుల కుమారుడు నందీశ్వరనాయుడు ధర్మవరంలోని గీతానగర్‌లో ఉన్న తన చిన్నాన్న కృష్ణ ఇంటికి సెలవుకు వచ్చాడు. ఈ క్రమంలో పట్టణంలోని జీవానంద స్కూల్ సమీపంలో ఉన్న స్విమ్మింగ్ పూల్ వద్దకు చిన్నాన్నతో కలిసి వెళ్లాడు. అయితే అక్కడ చిన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టాడు. ఈత రాకపోవడంతో అందులో మునిగిపోయాడు. అచేతనంగా ఉన్న బాలుడిని గమనించి, బయటికి తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.94	1,577.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,894	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	283	138
నీటి నిల్వ (టీఎంసీలు)	7.28	3.49

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో హనుమంతుడు

సిరుగుప్ప, మే 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పెటె ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశనూరు రోడ్డు మార్గంలో పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన పేటే ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వామివారికి పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమప్ప చెరువు గట్టుపై
క్షుద్రపూజలు ..!



చెరువు గట్టుపై క్షుద్రపూజ సామగ్రి

కంప్లి, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వుండే సోమప్ప చెరువుగట్టుపై క్షుద్ర పూజలు జోరుగా జరుగుతున్నాయి. ప్రతి అమావాస్య, పౌర్ణమి క్షుద్రపూజలు జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో సోమప్ప చెరువు గట్టుపైకి వాకింగ్‌కు, యోగాకు వచ్చే వారు ఆందోళనకు గురవుతున్నారు. పురసభ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. మున్ముందు ఎలాంటి పూజలు జరుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



లక్ష్మణ్ నాయక్(ఫైల్)

బళ్లారి సిటీ,మే 10(ఆంధ్రజ్యోతి): విజయనగరం నగర పోలీసు విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్ నాయక్(42) అనారోగ్యంతో శుక్రవారం కన్ను మూశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.హూవి నహడగలి తాలూకాలోని దాసరహళ్ళి తండాకు చెందిన లక్ష్మణ్ నాయక్ 2005 నుంచి పోలీసుగా సేవలందిస్తున్నారు. ఆయన మృతిపై జిల్లా ఎస్పీ శ్రీ హరిబాబు, ఏఎస్పీ సలీం పాషా, డీవైఎస్పీ మంజునాథ్ తళవార తదితర పోలీస్ సిబ్బంది సంతాపం ప్రకటించారు. దాసరహళ్లి తండాలో ప్రభుత్వ లాంఛ నాలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

అఖిల భారత సమ్మెను విజయవంతం చేయండి

● ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాడాలి ● 20న నిరసనకు అందరూ మద్దతివ్వాలి : సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సత్యబాబు

బళ్లారి సిటీ, మే 10(ఆంధ్రజ్యోతి) అఖిల భారత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సత్యబాబు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన ముందస్తు కార్మికుల సమావేశంలో ఆమన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ యజమానుల ప్రయోజనాల కోసం 29కార్మిక అనుకూల చట్టాలను సవరిస్తూ, 4 కార్మిక కోడ్‌లను అమలు చేస్తోందన్నారు. త్యాగాల ద్వారా సంపాదించిన కార్మిక హక్కులు సౌకర్యాలను లాక్కోబోతుందన్నారు. దీనికి వ్యతిరేకంగా బలమైన ఉమ్మడి కార్మిక పోరాటాన్ని బలోపేతం చేయాలని, మే20న చేపట్టిన అఖిల భారత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఏఐయూటీయూసీ జిల్లాఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ మాట్లాడుతూ కార్మికులు తమ ఆర్థిక డిమాండ్లకే పరిమితం కాకుండా దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని తీవ్రతరం చేయాలన్నారు. అన్ని పాలక పార్టీలు యజమానుల ప్రయోజనాలను కాపాడుతాయి. మొత్తం కార్మిక వర్గం ఒక్కటేనని అందరూ భావించా లన్నారు. కులం మతం, భాష పేరుతో కార్మికులను విభజించడానికి పెట్టుబడిదారీ వర్గం , వారి ప్రభుత్వాలు చేస్తున్న కుట్రను ఓడించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆదిమూర్తి మాట్లాడుతూ ప్రజల పన్నులతో నిర్మించిన ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడం సరి కాదన్నారు. బ్యాంకులు, బీమా, రైల్వేలు మొదలైన ప్రభుత్వ సంస్థలను కార్పోరేట్ యజమానులకు అప్పగిస్తున్నారన్నారు. పెట్టుబడిదారుల లాభాపేక్ష కోసం కార్మికులు, సామాన్యప్రజల ప్రయోజనాలను బలి చేస్తున్నారన్నారు. సీనియర్ కార్మిక నాయకుడు టీజీ విఠల్ మాట్లాడుతూ వ్యాపారం చేయడంలో సులభతరం విధానానికి అనుగుణంగా శ్రామిక ప్రజలపై మొత్తం మీదవాస్తవిక బానిసత్వ పరిస్థితులను విధించడానికి ప్రభుత్వం సమగ్ర బ్లూప్రింట్‌తో ముందుకు సాగుతోందని, దీనిని బలమైన పోరాటం ద్వారా వ్యతిరేకించాలన్నారు. ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజల విశ్వాసం సంపాదించిన ఎల్ఐసీని కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో ప్రైవేటీకరించి విక్రయిస్తుందన్నారు. ఇది 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించబోతుందన్నారు. దీనికి వ్యతిరేకంగా మనమందరం గొంతు విప్పాలన్నారు. అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రమోద్ , చెన్నబసయ్య, గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకులు మల్లికార్జున, మధుకంటి, వేణుగోపాల్‌శెట్టి, మహంతయ్య, ఆశా వర్కర్ల నాయకులురాలు శాంత, అంగన్‌వాడీ నాయకురాలు ఉమాదేవి పాల్గొన్నారు.



సైనికులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్యవైశ్య నాయకులు

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని పూజలు

బళ్లారి సిటీ,మే 10(ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులపై చర్యలకు ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ఆలయాలు, మసీదుల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. నగరంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేస్తూ నగర ఆర్య వైశ్య సమాజ సభ్యులు భారత సేనకు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జిల్లా యూనిట్ సహా వివిధ సంస్థల ఆఫీసు బేరర్లు నగరం, జిల్లాలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అపరేషన్ సిందూర్ విజయవంతం కావాలంటూ తాలూకాలోని హొసూర్ గ్రామంలోని హొసూరమ్మ ఆలయం, గాదిగనూరు గ్రామంలోని బసవేశ్వర ఆలయం, బైలువద్దిగేరిలోని సుడుగాడప్ప ఆలయం, పాపినాయకహళ్లిలోని సాయిబాబా ఆలయంలో బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు కాకుబాల్ రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి భూపాల ప్రహ్లాద్, అరళిహళ్ళి జయలక్ష్మి, అయ్యాళ్ళి తిమ్మప్ప, రాఘవేంద్ర, శంకర్‌మేటీ, రేవణసిద్దప్ప, చంద్రు, హొన్నూరప్ప, తిరుమలేశ్, మహేశ్, మణికంఠ పాల్గొన్నారు.

నేల, నీటి సంరక్షణ తప్పనిసరి

● గనుల ప్రాంత రైతులకు అవగాహన కల్పించాలి
● జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్

బళ్లారి సిటీ,మే 10(ఆంధ్రజ్యోతి): మైనింగ్ ప్రభావిత మండలాల్లో ఇంటిగ్రేటెడ్ ఎన్విరాన్‌మెంటల్ ప్రాజెక్ట్ లక్ష్యం మైనింగ్ ప్రభావిత మండలాల్లోని రైతులకు వారి భూములలో నేల , నీటిని సంరక్షణపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్ అన్నారు. బళ్లారి తాలూకాలోని హలకుంది గ్రామ పంచాయితీ పరిధిహొన్నళ్ళి తండాలో మైనింగ్ ప్రభావిత మండలాల కోసం సమగ్ర పర్యావరణ నిర్వహణ ప్రణాళిక కింద వాటర్‌షెడ్ అభివృద్ధి శాఖ,వ్యవసాయ శాఖ, బళ్లారి, లింగసుగూర్ అమలు సంస్థ నిర్వహించిన కమ్యూనిటీ బాగస్వామ్మ కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. ఈప్రాజెక్టు కోసం మొదటి దశలో బళ్లారి జిల్లాతో సహా రాష్ట్రంలోని నాలుగు జిల్లాలను మైనింగ్ ప్రభావ మండలాలుగా ఎంపిక చేశారన్నారు. ఈప్రాజెక్టు ఐదేళ్ళ పాటు అమలు చేస్తామన్నారు. ఈపథకం కిందపనిచేసే సిబ్బంది స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్ళి రైతులతో చర్చించి అవసరమైన సమాచారం, పత్రాలను పొందడానికి సర్వేలు నిర్వహిస్తారన్నారు. గ్రామంలోని రైతులందరూ సరైన సమాచారాన్ని అందించాలన్నారు. మైనింగ్ ఎన్విరాన్‌మెంటల్ రివైటలైజేషన్ కార్పోరేషన్ ఆదేశాల మేరకు ఈ ప్రాజెక్టు అమలు చేస్తామన్నారు. ఈసందర్భంగా సంస్థకు చెందిన విజయమేటి, జిల్లా బృందం నాయకులు అశ్విని, గ్రామపంచాయితీ సభ్యులు నిర్మలా బాయి. రమేశ్ నాయక్, రవినాయక్,వ్యవసాయ అధికారులు లోక్ రాజ్,బసవరాజ్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీవై గోర్పడే

బళ్లారిరూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోట ప్రాంతంలో జిల్లా పంచాయతీ కార్యాలయంలో కర్ణాటక రాష్ట్ర పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ కార్యాలయంలో కార్యక్రమాన్ని వీవై గోర్పడే, ఎమ్మెల్సీ వైఎం సతీష్ మొక్కకు నీరు పోసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీవై గోర్పడే మాట్లాడుతూ పంచాయతీరాజ్‌ను 1973కర్ణాటక ప్రభుత్వంలో ఎంవై గోర్పడే సహకరించడంతో అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ చట్టాన్ని దేశంలోనే చేశారన్నారు. అదేవిధంగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ వేదిక ద్వారా సంయుక్త శ్రమలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంను రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ చట్టం బిల్లును ప్రారంభించారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ అధ్యక్షుడుబావి బట్టప్ప, కురుగోడు మాజీ ఎమ్మెల్యే బాణాపురం, శివరామి రెడ్డి,హేమ, మంజునాథ్, పీడీవోల సంఘం అధ్యక్షులు నాగరాజుగౌడ, కేఎస్ సతీష్ మమతా తల్వార్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మీడియా సలహాదారులు సుబ్రహ్మణ్యేశ్వర సదాశివ అధ్యక్షుడు, కురుగోడు తాలుకా అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యమే లక్ష్యంగా పోరాడాలి

●కన్నడ నటుడు చేతన్ అహింసా పిలుపు



మాట్లాడుతున్న నటుడు చేతన్ అహింసా

రాయచూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : సామాజిక చైతన్యమే లక్ష్యంగా సంఘటిత పోరాటాలకు సిద్ధపడాలని నటుడు చేతన్ అహింసా పిలుపు నిచ్చారు. వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని మాన్వి పట్టణంలో ఏర్పాటు చేసిన అభ్యుదయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. వర్గీకరణ పోరాటంతో పాటు రాజకీయ అవగాహన కోసం దళిత యువకులు తమవంతు కృషి చేయాలన్నారు. అంబేద్కర్ కలలుగన్న సమాజ నిర్మాణం కోసం నేటి తరం యువతులు ప్రతిజ్ఞ పూనాలని కోరారు. సమావేశంలో బాలస్వామి కోడ్లి తదితరులున్నారు.

'గాలి' విడుదల కోసం ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం నాయకులు

బళ్లారి సిటీ, మే 10(ఆంధ్రజ్యోతి):మైనింగ్ స్కామ్ కేసులో శిక్ష పడిన గంగావతి సిట్టింగ్ ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి విడుదల కావాలని ముస్లిం నాయకులు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నగరంలోని ప్రసిద్ధ దర్గా ముఖ్దుంజానీ బాబా దర్గాలో ముస్లీం నాయకులు మున్నాబాయ్, ఖాదిర్ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. మైనార్టీలకు నిత్యం అండగా ఉండే గాలి జనార్ధన్ రెడ్డి బయటకు రావాలని వారు కోరారు. ఈసందర్భంగా మైనార్టీ నాయకులు మున్నాబాయి, ఖాదిర్, రఫిక్, మునీర్, హుండేకర్ రాజేశ్, ముద్దుల్ నూర్,ఇమ్రాన్, ఆలీ,మారేశ్, వలి, గాదెలింగ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

● పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత సత్యప్ప

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మరమ్మతులను పరిశీలిస్తున్న అధ్యక్షురాలు సుజాత సత్యప్ప

కంప్లి, మే 10(ఆంధ్రజ్యోతి) : కుడితిని పట్టణంలో 18వ వార్డులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుం టామని పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత సత్యప్ప తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతి పత్రికలో కుడితినిలో 'తాగునీటికి కటకట' శీర్షికపై స్పందించిన అధికారులు శనివారం 18 వార్డులో పర్యటించారు. అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుజాత సత్యప్ప మాట్లాడుతూ రెండు రోజులుగా మోటార్లు చెడిపోవడంతో నీటి సమస్య ఏర్పడిందన్నారు. వెంటనే బోర్లు రిపేరీ చేయించి వార్డు ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. వారితో పాటు కౌశిక్ శ్రీనివాస్ వినోద్ గిరీష్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

హొసూరు జోన్

సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



కార్ల్‌మార్క్స్ చరిత్ర పుస్తకాలు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

హొసూరు, మే 10(ఆంధ్రజ్యోతి): వీపీ చింతన్ 38వ వర్ధంతిని పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీధర్ అధ్యక్షత వహించారు. సీపీఎం హొసూరు నగర కార్యదర్శి నగేశ్‌బాబు, జాయింట్ సెక్రటరీ దేవరాజ్, రైతుసంఘం అధ్యక్షుడు రాజారెడ్డి, కార్యదర్శి మునిరాజ్ ముఖ్యులుగా విచ్చేశారు. హొసూరు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్యులు భువన, అపూర్వదర్శిని, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో 22 యూనిట్ల రక్తదానం సేకరించారు. రక్తదాతలకు ధ్రువీకరణపత్రాలు అందచేశారు. కార్ల్‌మార్క్స్ చరిత్రపై పుస్తకం పంపిణీ చేశారు.

ఉత్సాహంగా షాట్‌పుట్ పోటీలు

హొసూరు, మే 10(ఆంధ్రజ్యోతి): దక్షిణమండల స్థాయిలో పవర్‌గ్రిడ్ మహిళా ఉద్యోగులకు నిర్వహించిన షాట్‌పుట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. రెండు రోజుల టోర్నీలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరిలనుంచి ఆరు మహిళా జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సౌత్‌జోన్2 మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణకుమార్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. క్రీడలతో ఉద్యోగులకు ఉపశమనం కలుగుతుందన్నారు.

గుట్కా స్వాధీనం.. నిందితుడి అరెస్ట్

హొసూరు, మే 10(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో నిషేధించిన గుట్కాను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హొసూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ నేతృత్వంలో పోలీసులు అశోక్ పిల్లర్ ప్రాంతంలో వాహన తనిఖీలు చేస్తుండగా కారులోని 225 కిలోల గుట్కాను గుర్తించారు. డ్రైవర్‌ను సోర్నాలింగం (30)గా గుర్తించారు. పోలీసులు గుట్కాను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న గుట్కా, అరెస్ట్ అయిన నిందితుడు

ఘనంగా హేమారెడ్డి మల్లమ్మ జయంత్యుత్సవం



హేమారెడ్డి మల్లమ్మ చిత్రం ఊరేగింపులో పాల్గొన్న ప్రముఖులు



మల్లమ్మకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ సతీష్

బళ్లారి గాంధీనగర్, మే 10(ఆంధ్రజ్యోతి): హేమారెడ్డి మల్లమ్మ సాక్షాత్తు శ్రీశైల మల్లికార్జునుడి అనుగ్రహానికి పాత్రురాలై, సమస్త రెడ్డి సమాజం అభివృద్ధికి అవతరించిన ధన్యురాలు అని, మల్లమ్మ ఆదర్శాలు, తత్వాల మార్గదర్శకంలో సాగాలని విధానపరిషత్ సభ్యులు వై.ఎం. సతీష్ అభిప్రాయపడ్డారు. జిల్లా పాలనా మండలి, జిల్లా కన్నడ సంస్కృతి శాఖ, సిటీ కార్పొరేషన్ సంయుక్తంగా నగరంలోని పార్వతి నగర్‌లో బసవ భవన్‌లో ఘనంగా నిర్వహించిన హేమారెడ్డి మల్లమ్మ జయంతి ఉత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శ్రీశైల మల్లికార్జున స్వామి ఆరాధ్య దైవంగా స్వీకరించి సాక్షాత్కరించుకున్న మహాసాధ్వి మల్లమ్మ అని, వేమన మహాయోగిగా మారడానికి ప్రేరణగా నిలిచిందన్నారు. వీరశైవ లింగాయ రెడ్డి సమాజం అధ్యక్షుడు డాక్టర్ జీవీ మహిపాల్ మాట్లాడుతూ, మహాసాధ్వి హేమారెడ్డి మల్లమ్మ అన్ని సమాజాల వారికి ఆదర్శ మహిళగా నిలిచారని, భక్తి మార్గం ద్వారా శ్రీశైల మల్లికార్జున స్వామి మహిమలను జనసామాన్యులకు వద్దకు తీసుకొచ్చి భక్తిపారవశ్యాన్ని నింపారన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైల మల్లికార్జున స్వామి క్షేత్రంలో కణ్ణీరు అనే స్థలంలో హేమారెడ్డి మల్లమ్మ దేవస్థానం చూడవచ్చన్నారు. కొట్టూరు స్వామి విద్యాసంస్థ , మహా విద్యాలయం రిటైర్డ్ అధ్యాపకి సుశీల సిరూరు హేమారెడ్డి మల్లమ్మ భక్తి పారవశ్యాన్ని వివరించారు. 1వ శతాబ్దానికి చెందిన ప్రముఖ శివశరణి హేమారెడ్డి మల్లమ్మ జనసామాన్యుల్లో భక్తిని నింపేందుకు కృషి చేశారన్నారు. కుటుంబ కష్టాలను ఎదుర్కొని నిలబడి ఆదర్శ విలువలను జీవితంలో నింపుకుని సామాజిక, ధార్మిక కార్యక్రమాలతో తనదైన భక్తి మార్గాన్ని జనసామాన్యుల గుండెల్లో నింపడానికి కృషి చేసిన మహిళగా ఆమె అభివర్ణించారు. ఈ సందర్భంగా కన్నడ సంస్కృతి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, పాలికె సభ్యులు సురేఖా మల్లనగౌడ, అసిస్టెంట్ కమిషనర్ పి.ప్రమోద్‌తో పాటు సమాజ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు హేమారెడ్డి మల్లమ్మ భావచిత్రాన్ని నగర పురవీధుల్లో ఊరేగించారు.

సిరుగుప్ప : హేమారెడ్డి మల్లమ్మ ఉత్తమ మహిళ అని తహసీల్దార్ నరసప్ప అన్నారు. శనివారం సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో తాలుకా పరిపాలన, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మల్లమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఆమె శివభక్తి అపారమైనదని, ఆమె తత్వ సిద్దాంతాలను ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, మాజీ తాలుకా పంచాయతీ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, గ్యారెంటీ సమితి అధ్యక్షులు మారుతి వరప్రసాద్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.



సిరుగుప్పలో మాట్లాడుతున్న తహసీల్దార్ నరసప్ప

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గవియప్ప

కంప్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : హొస్పేట ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప కమలాపురంలో రూ. 26.17 కోట్లు అమృత్ 2.0 పథకం కింద తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. శనివారం కమలాపురంలోని వాల్మీకి సర్కిల్ సమీపంలోని నీటి సరఫరా కేంద్రం ఆవరణలో హొస్పేట ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప భూమిపూజ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలో తాగునీటి కొరతకు శాశ్వత పరిష్కారం కోసం అమృత్ 2.0 ప్రాజెక్టు కింద తాగునీటి సరఫరా యూనిట్‌ను ప్రారంభిస్తామన్నారు. ఇందులో పట్టణంలో ఫీడర్ ప్రధాన పైపులైన్ నిర్మాణం పది లక్షల లీటర్ల సామర్థ్యంతో ఎగువ నీటి రిజర్వాయర్ నిర్మాణం 6199 కిలోమీటర్ల పంపిణీ నెట్‌వర్క్, పట్టణంలోని దాదాపు ఆరు వేలు ఇళ్లకు నీటి కనెక్షన్‌లను అందిస్తా మన్నారు. ప్రస్తుతం ఉన్న 4.54 ఎంఎల్‌డీ సామర్థ్యం గల నీటి శుద్ధి కర్మాగారాన్ని పునరుద్ధరించనున్నారు. మొత్తం రూ. 26.17 కోట్లు వ్యయంతో ఈ పని ప్రారంభించబడింది. నాణ్యమైన పనుల కోసం ప్రత్యేకంగా నిర్మించాలని కాంట్రాక్టర్లకు సూచించామన్నారు. అదే సమయంలో కమలాపురం మున్సిపాల్టీ కార్యాలయంలో రెండు కొత్త చెత్తవాహనాలు, ఒక జేసీబీ యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, సభ్యులు ముక్తియార్ బాషా, నామినేటెడ్ సభ్యులు కన్నేశ్వర, సోమశేఖర్, నాయకులు ఖాజాహుస్సేన్, ముఖ్యఅధికారి, డీబీ ఇరానా పాల్గొన్నారు.